క్లుప్తంగా

కొబ్బరి మొక్కల ధ్వంసంపై ఫిర్యాదు



నర్సయ్యమ్మ పెరటిలో పీకేసిన కొబ్బరిమొక్కలు

పూసపాటిరేగ: మండలంలోని పతివాడబ ర్రిపేట గ్రామంలో బర్రి నర్సయ్యమ్మకు చెందిన కొబ్బరి మొక్కలు ధ్వంసం చేయడంపై పూసపాటిరేగ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. గ్రామానికి చెందిన కొమర పైడిరాజు, కొమర నీలాకరి, బర్రి చిన కొర్లమ్మ , బర్రి సామాలమ్మలు తమ ఇంటి ప్రహరీలోకి శనివారం అక్రమంగా ప్రవేశించి కొబ్బరి మొక్కలను నరికివేశారని బాధితురాలు బర్రి నర్సయ్యమ్మ ఫిర్యాదు చేసింది. ఇంటిలో ఎవ్వరూ లేని సమయంలో విధ్వంసం సృష్టించారని పేర్కొంది. ఎస్సై ఐ.దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



కలెక్టరేట్‌లోని సఖి కార్యాలయంలో జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న బాలికలు

విజయనగరం ఫోర్ట్: బాలికలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని మంగళగిరి ఎయిమ్స్ ప్రొఫెసర్ నవ్యకృష్ణ నాయుడు సూచించారు. మంగళగిరి నుంచి బాలికలతో శనివారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తహీనత బారిన పడకుండా బాలికలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అలాగే బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని తెలిపారు.

వృద్ధాశ్రమానికి సరుకుల వితరణ



వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన సన్యాసిరావు, తదితరులు

విజయనగరం రూరల్: మండలంలోని ద్వారపూడి గ్రామంలో నిర్వహిస్తున్న గాంధీజీ వృద్ధాశ్రమానికి కేఎల్‌పురంనకు చెందిన తెరపల్లి సన్యాసిరావు దంపతులు శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకుడు రాజు మాట్లాడుతూ... విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న సన్యాసిరావు వంద కేజీల రైస్‌తో పాటు నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేయడం ఆనందంగా ఉందన్నారు.

అభినందనలు..




ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: రాష్ట్ర స్థాయి సీనియర్ కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనే జిల్లా జట్టులో పట్టణానికి చెందిన సత్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ఐదుగురు ఎంపికయ్యారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి వారిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎంపికైన క్రీడాకారులు ఎం.శ్రీవల్లి, బి.రమ్య, ఎం.సేతు మాధవి, బి.వరలక్ష్మి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, తదితరులు పాల్గొన్నారు.

సీబీసీఎన్‌సీ ఆస్తుల పరిరక్షణే ధ్యేయం

- ట్రస్ట్ అసోసియేషన్ చైర్మన్ ఆర్ఎస్ జాన్



మాట్లాడుతున్న సీబీసీఎన్‌సీ ట్రస్ట్ చైర్మన్ ఆర్ఎస్.జాన్

విజయనగరం టౌన్: కన్వెన్షన్ ఆఫ్ ది బాప్టిస్ట్ చర్చ్‌స్ ఆఫ్ ది నార్తరన్ సర్కార్స్ (సీబీసీఎన్‌సీ) ఆస్తులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ట్రస్ట్ ప్రతినిధులపై ఉందని ట్రస్ట్ అసోసియేషన్ చైర్మన్ ఆర్ఎస్.జాన్ స్పష్టం చేశారు. సీబీసీఎన్‌సీ 70వ ఐక్య మహాసభలను స్థానిక ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ పక్కనున్న సిమ్స్ బాప్టిస్ట్ చర్చిలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టి. ఆనందరావు, జామి శరత్, కుమార్, వై.ప్రభాకర్, బాలచందర్, ఎం.రజాకర్, తదితరులు పాల్గొన్నారు.

కనుమరుగైన లక్ష్యం..

- వృథాగా సామూహిక మరుగుదొడ్లు
- లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా



జొన్నవలసలో మూలకు చేరిన సామూహిక మరుగుదొడ్లు

విజయనగరం రూరల్: ప్రజాప్రతినిధులు, అధికారుల అనాలోచిత నిర్ణయాలతో లక్షలాది రూపాయలతో గ్రామాల్లో నిర్మించిన కమ్యూనిటీ మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. 2014-19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రజాధనం వృథా చేసి అవసరం లేని చోట్ల సామూహిక మరుగుదొడ్లను నిర్మించింది. మండలంలోని జొన్నవలస, బియ్యాలపేట, పినవేమలి, దుప్పాడ, కోరుకొండ, చెల్లూరు, ద్వారపూడి, రాకోడుతో పాటు పలు గ్రామాల్లో ప్రజాధనంతో నిర్మించిన మరుగుదొడ్లు శతశాతం నిరుపయోగంగా పడి ఉన్నాయి. నిర్మించిన మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయం లేక స్థానికులు ఉపయోగించకుండా అప్పట్లోనే విడిచిపెట్టేశారు. ఆయా గ్రామాల్లో కమ్యూనిటీ మరుగుదొడ్లు నిర్మించాల్సిన అవసరం లేకపోయినప్పటికీ కేవలం టీడీపీ నాయకులకు కాంట్రాక్ట్ పనులు అప్పగించడం కోసం మరుగుదొడ్లను నిర్మించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథాగా మారింది. సామాజిక మరుగదొడ్లతో పాటు వ్యక్తిగత మరుగదొడ్లను కూడా నిర్మించేలా నాటి టీడీపీ ప్రభుత్వం చొరవ తీసుకున్నప్పటికీ మరుగుదొడ్లవినియోగంపై అవగాహన కలిగించలేకపోయింది. చాలా గ్రామాల్లో ఇంటి ముందున్న మరుగుదొడ్లలో వంట సామగ్రి, వ్యవసాయ పనిముట్లు దాచిపెట్టుకుంటున్నారు.

నిర్వహణ లోపం..

2019 తర్వాత వైఎస్సార్‌సీపీ హయాంలో బహిరంగ మలవిసర్జన చేయడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు వివరించి, ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించేలా చర్యలు తీసుకుంది. అలాగే నిరుపయోగంగా ఉన్న సామూహిక మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించారు. అయితే ఆరు నెలల కిందట మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం అమల్లోకి వచ్చినప్పటి నుంచి సామూహిక మరుగుదొడ్ల నిర్వహణను గాలికొదిలేశారు. చాలా చోట్ల తలుపుల్లేవు. మరికొన్ని చోట్ల రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించలేదు. అధికారులు స్పందించి సామూహిక మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



బియ్యాలపేట గ్రామంలో వృథాగా పడిఉన్న మరుగుదొడ్లు

వైద్య సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలి



టెలీ మెడిసిన్ హబ్ వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ జీవన రాణి

- డీఎంహెచ్ఓ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: వైద్య సిబ్బంది పనితీరు మెరుగు పరుచుకోవాలని డీఎంహెచ్ఓ జీవనరాణి ఆదేశించారు. పట్టణంలోని ఇస్సాయిల్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఓపీ సేవలను పెంచాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు శత శాతం వేయాలని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించి, అవసరమైన సేవలు అందించాలన్నారు. అనంతరం టెలీ మెడిసిన్ హబ్‌ను తనిఖీ చేశారు. ఎటువంటి వైద్యసేవలు కావాలని ఫోన్ కాల్స్ వస్తున్నాయని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అలాగే జిల్లా సత్వర చికిత్స కేంద్రాన్ని సందర్శించారు.

వలంటీర్లపై కక్ష సాధింపు చర్యలు తగవు



అంబేడ్కర్ జంక్షన్ వద్ద నిరసన తెలియజేస్తున్న వలంటీర్లు

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్

విజయనగరం పూల్‌బాగ్: ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా పని చేసి ప్రజలకి సేవలందించిన వలంటీర్లపై కక్ష సాధింపు తగదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ అన్నారు. వలంటీర్లకు పది వేల రూపాయల జీతం ఇస్తూ వారిని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఏపీ గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మానవహారంగా ఏర్పడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. వలంటీర్ల సహాయంతో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కిందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు వారికి పది వేల జీతం ఇచ్చి కొనసాగిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు నెరవేర్చలేదని చెప్పారు. ఆరు నెలల బకాయి వేతనాలను కూడా వెంటనే విడుదల చేయాలని కోరారు. వచ్చే నెల 11వ తేదీ నుంచి జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో వలంటీర్లకు న్యాయం చేయకపోతే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్. రంగరాజు, సీపీఐ విజయనగరం మండల నాయకుడు వెలగడ రాజేష్, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వలంటీర్లు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ జీవీలో క్లీన్ అండ్ గ్రీన్

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీలో శనివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. యూనివర్సిటీ జాతీయ సేవా సమితి (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో యూనివర్సిటీ ప్రాంగణాన్ని పరిశుభ్రం చేయడంతో పాటు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి. రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ జి.జయసుమ, ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రోటరీ సేవలు అమూల్యమైనవి

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



నిరుపేద మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న మంత్రి కొండపల్లి, తదితరులు

విజయనగరం టౌన్: ప్రపంచ వ్యాప్తంగా రోటరీ క్లబ్ చేస్తున్న సేవలు అమూల్యమైనవని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక ముడిదాం వద్దనున్న మెట్రో కన్వెన్షన్ హాల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఐదవ రోటరీ అంతర్జాతీయ జిల్లా సదస్సును వైభవం పేరుతో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రోటరీ సభ్యులందరూ పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్ట్‌లతో అనుసంధానించి యువతకు ఉపాధి కల్పించాలని సూచించారు. అందుకు ప్రభుత్వం తరఫున సహకారమందిస్తామన్నారు. కోల్ ఇండియా సీఎస్సార్ ప్రాజెక్ట్ కింద 40 ఆటోమెటిక్ కుట్టుమిషన్‌లను నిరుపేద మహిళలకు అందజేశారు. అదేవిధంగా దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు 50 కళ్లద్దాలను అందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు ఎం.వెంకటేశ్వరరావు, ప్రమోద్ పరేఖ్, డాక్టర్ పద్మకుమారి, ప్రముఖ సినీ గేయరచయిత అనంతశ్రీరామ్, లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ్, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర మలుపు..



పూసపాటిరేగ మండలంలోని తొత్తడాం, పతివాడ గ్రామాల మధ్యలో గల ఆర్అండ్‌బీ రహదారి మలుపు వద్ద తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ రహదారిపై ప్రతిరోజూ వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు గాని స్పీడ్‌బ్రేకర్లు గాని ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. – పూసపాటిరేగ

అభినందనలు..



పూసపాటిరేగ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించిన ఎం. హనుమంతురావును పలువురు ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు విజయకుమారి, నాగేశ్వరావు, ఎం. సత్యనారాయణ, రమణమూర్తి, మురళి, బి. శంకరరావు, తదితరులు పాల్గొన్నారు. – పూసపాటిరేగ

శంకుస్థాపన..



డెంకాడ మండలంలోని గుణుపూరుపేటలో సీసీ రోడ్డు నిర్మాణానికి జెడ్పీటీసీ సభ్యురాలు బడుకొండ లక్ష్మి, తదితరులు శనివారం శంకుస్థాపన చేశారు. జిల్లా పరిషత్ నిధులతో సీసీ రోడ్డు నిర్మించనున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పైల ముత్యాలరావు, ఉప సర్పంచ్ వాకాడ శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకుడు రాముడు నాయుడు, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు. – డెంకాడ

పుస్తకావిష్కరణ..



భారత ప్రధాని నరేంద్రమోదీ క్యాబినెట్‌లో ఉన్న 71 మంది మంత్రుల రాజకీయ, వ్యక్తిగత జీవిత విశేషాలపై తెలుగుబాషా విశిష్ట సేవా పురస్కార గ్రహీత సముద్రాల గురుప్రసాద్ రచించిన నరేంద్ర మోదీ ఆస్థానం పుస్తకం ఎంతో బాగుందని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో శనివారం ఆయన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, పుస్తక రచయిత గురుప్రసాద్ పాల్గొన్నారు. – విజయనగరం టౌన్

పశువులకు వైద్య చికిత్సలు



డెంకాడ: లేగ దూడలకు నట్టల నివారణ మందు వేస్తున్న డాక్టర్ శ్రీకాంత్, సిబ్బంది



పూసపాటిరేగ: కొల్లాయివలసలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఈశ్వర శ్రీనివాస్, అప్పలరాజు, తదితరులు

డెంకాడ: మండలంలోని గొలగాం గ్రామంలో శనివారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించి పశువులు, మూగజీవాలకు ఉచిత వైద్యసేవలు అందించారు. పశు వైద్యాధికారి శ్రీకాంత్ 73 పశువులకు సాధారణ చికిత్సలు చేశారు. అలాగే 23 పశువులకు గర్భకోశ చికిత్సలు.. 420 గొర్రెలు, మేకలతో పాటు 133 ఆవులు, లేగ దూడలకు నట్టల నివారణ మందులు వేశారు.

వినియోగించుకోవాలి..

పూసపాటిరేగ: పశు వైద్యశిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని గోవిందపురం పశువైద్యాధికారి యు.రాజేశ్వరి అన్నారు. మండలంలోని గుండపురెడ్డి పాలెంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, మూగజీవాలకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కూనిశెట్టి గోవిందరావు, జలపార శ్రీనువాసురావు, తదితరులు పాల్గొన్నారు.

శిబిరానికి స్పందన

పూసపాటిరేగ: మండలంలోని కొల్లాయివలస గ్రామంలో నిర్వహించిన పశు వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించింది. శిబిరంలో 125 పశువులకు సాధారణ వైద్య చికిత్సలు, 35 పశువులకు గర్భకోశ చికిత్సలు, వ్యాధి నిరోధక టీకాలు, 900 మేకలు, గొర్రెలకు నట్టలు నివారణ మందులు వేశారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పశు వైద్యశాఖాధికారి ఈశ్వరశ్రీనివాస్, ప్రజాప్రతినిధి వందనాల అప్పలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



పూసపాటిరేగ: కోనయ్యపాలెంలో రైతులకు మందులు అందజేస్తున్న పశువైద్యాధికారులు

ఓటు ఎంతో శక్తివంతమైనది..

- తహసీల్దార్ సురేష్

పూసపాటిరేగ: భారతదేశంలో ఓటు అత్యంత శక్తివంతమైనదని భోగాపురం తహసీల్దార్ ఎం. సురేష్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక జాతీయ రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు అనే ఆయుధంతో శక్తివంతమైన నాయకులు, నిజాయితీ గల నాయకులను ఎన్నుకోవచ్చన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, వీఆర్ఓలు పాల్గొన్నారు.

ఓటు హక్కు పొందడం బాధ్యత

డెంకాడ: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు పొందడం, వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని తహసీల్దార్ పద్మావతి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో అర్హులందరూ ఓటుహక్కు పొందాలన్నారు. అనంతరం సీనియర్ ఓటర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు



విజయనగరం అర్బన్: ప్రతిజ్ఞ చేస్తున్న సీతం కళాశాల విద్యార్థులు, యాజమాన్య సిబ్బంది



పూసపాటిరేగ : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న తహసీల్దార్ గోవింద్



డెంకాడ: సీనియర్ ఓటర్‌ను సన్మానిస్తున్న తహసీల్దార్ పద్మావతి, తదితరులు



పూసపాటిరేగ: భోగాపురంలో ఓటర్ల దినోత్సవంలో భాగంగా ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్ సురేష్, తదితరులు

విద్యాలయాల్లో..

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ.. విద్యార్థులు ఓటుహక్కును సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీడీవీ నాయుడు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక తోటపాలెంలోని సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీ సాయిదేవమణి, అధ్యాకులు, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటర్లదే కీలకపాత్ర

నెల్లిమర్ల: ప్రజాస్వామ్యంలో ఓటర్లదే కీలక పాత్ర అని తహసీల్దార్ పి. సుదర్శనరావు, డిప్యూటీ డీఈఓ కేవీ రమణ అన్నారు. నెల్లిమర్ల బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ ఓటర్లు సూరీడమ్మ, అప్పయ్యమ్మ, పోలిపల్లి తదితరులను సత్కరించారు. అలాగే ఉత్తమ విధులు నిర్వహించిన బీఎల్‌ఓలు ఉషా, కిరణ్మయి, వెంకటలక్ష్మి, సూర్యనారాయణ, దివ్య, మీరాఖాన్‌షేక్, ఆపరేటర్లు మహేష్, భాస్కర్‌రావులను సన్మానించారు. ఎన్నికల డీటీ వీవీఆర్ జగన్నాథరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ కె. రామకృష్ణరాజు, సబ్ రిజిస్ట్రార్ కె.రాజు, ఈఓపీఆర్‌డీ శంకర్‌జగన్నాథం, ఏఓ సుదర్శనం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.